క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంతో లాభాలు

• డీపీఎం ఆనందరావు



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న ఏఓ, డీపీఎం

పూసపాటిరేగ: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారి కె. నీలిమ, డీపీఎం ఆనందరావు అన్నారు. మండలంలోని ఎరుకొండ గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయంతో భూమి సారం కోల్పోదన్నారు. పైగా కార్బన్ శాతం పెరిగి అధిక దిగుబడులు వస్తాయని చెప్పారు. ఖరీఫ్‌కు ముందు నవధాన్యాలు సాగు చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీది ఏకపక్ష ధోరణి..

• డీసీసీ అధ్యక్షుడు మరిపి విద్యాసాగర్



నిరసన తెలియజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

విజయనగరం ఫోర్ట్: బీజేపీ ప్రభుత్వం ఏకపక్షంగా, క్రూరత్వంగా వ్యవహరిస్తోందని డీసీసీ అధ్యక్షుడు మరిపి విద్యాసాగర్ అన్నారు. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై చార్జిషీట్ దాఖలు చేయడాన్ని నిరసిస్తూ బుధవారం స్థానిక కేంద్ర ఇంటిలిజెన్స్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం చేస్తున్న తప్పుడు చర్యలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గోగాడ శ్రీనివాసరావు, డాక్టర్ గేదల తిరుపతి, శ్రీనివాసరావు, బంగారునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

'మేకా' చిరస్మరణీయుడు



మేకా కాశీవిశ్వేశ్వరుడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న భీష్మారావు, తదితరులు

విజయనగరం టౌన్: జిల్లాలోని అనేక సేవా సంస్థలకు తనదైన శైలిలో సేవలందించిన మహామనిషి, దాత అయిన మేకా కాశీవిశ్వేశ్వరుడు చిరస్మరణీయుడని ఘంటసాల స్మారక కళాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎమ్.భీష్మారావు అన్నారు. స్వర్గీయ మేకా కాశీవిశ్వేశ్వరుడి సంస్మరణ సభా కార్యక్రమాన్ని కొత్తపేట బుక్కావీధిలో ఉన్న ఆర్యసోమయాజుల కాశీపతిరావు స్మారక భవనంలో బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా కాశీవిశ్వేశ్వరుని చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ పి.స్వప్నహైందవి, ధవళ సర్వేశ్వరరావు, సత్యనారాయణ, అధిక సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలంటూ కార్మికుల పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న కార్మికులు

చీపురుపల్లి: తమకు న్యాయం చేయాలని కోరుతూ మండలంలోని కర్లాం వద్ద ఉన్న శ్రీ వెంకటరామా పౌల్ట్రీ పరిశ్రమ కార్మికులు పౌల్ట్రీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రతినిధులు, సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం పాదయాత్ర చేశారు. పరిశ్రమ వద్ద ఎర్ర జెండాలతో బయలుదేరిన కార్మికులు దాదాపు పది కిలోమీటర్లు నడిచి చీపురుపల్లిలోని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు క్యాంప్ ఆఫీస్‌కు చేరుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే కుమారుడు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడుకు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు సీఐటీయూ నాయకులు టి.వి.రమణ, అంబల్ల గౌరునాయుడు మాట్లాడుతూ శ్రీ వెంకటరామా పౌల్ట్రీ పరిశ్రమ యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందన్నారు. కార్మికులు న్యాయమైన కోర్కెలు అడిగితే వారిని తొలగించిడం సరికాదన్నారు. తొలగించిన కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, స్థానికులకే 75 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు గురునాయుడు, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

చీపురుపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఇప్పిలి వెంకటనర్సమ్మ అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఐ.సురేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, మండలంలోని అన్నిశాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు హాజరు కావాలని కోరారు.

మొక్కజొన్న సాగుతో లాభాలు..



• జిల్లాలో అత్యధికంగా పూసపాటిరేగలో సాగు
• క్వింటాకు రూ. 2100 పైగా మద్దతు ధర
• ఆసక్తి చూపిస్తున్న రైతులు

పూసపాటిరేగ: మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులు లాభాలు ఆర్జిస్తున్నారు. సాగులో అనుకున్న స్థాయిలో పంట దిగుబడి రావడంతో ఎక్కువ మంది రైతులు మొక్కజొన్నసాగుపై ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో సాగు విస్తీర్ణం ప్రతి ఏడదీ పెరుగుతోంది. జిల్లాలో రబీ సీజన్‌కు సంబంధించి సుమారు 20 వేల ఎకరాలలో మొక్కజొన్న సాగు అవుతుండగా పూసపాటిరేగ మండలంలోనే సుమారు 3 వేల ఎకరాలలో సాగు జరుగుతోంది. పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం, నెల్లిమర్ల, బొండపల్లి, గజపతినగరం, గంట్యాడ, ఎస్. కోట, రామభద్రాపురం మండలాల్లో అత్యధికంగా మొక్కజొన్న సాగవుతోంది. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించడంతో పాటు రైతులు లాభాలు ఆర్జిస్తున్నారు. ఎకరా సాగు విసీర్ణానికి రూ. 10 వేలు ఖర్చయితే 35 నుంచి 40 బస్తాల దిగుబడి వస్తుందని పూసపాటిరేగ పరిసర ప్రాంత రైతులు చెబుతున్నారు. క్వింటా మొక్కజొన్న రూ. 2100కు పైబడి ధర పలకడంతో ఎక్కువ మంది రైతులు సాగుపై దృష్టి సారిస్తున్నారు. పూసపాటిరేగ ప్రాంతంలో గల కొప్పెర్లలో విజయనగర్ బయోటెక్ పరిశ్రమతో పాటు, పౌల్ట్రీ యజమానులు మొక్కజొన్నను కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతంలో పండిన మొక్కజొన్నకు బాగా గిరాకీ పెరిగింది.

మొక్కజొన్నపైనే ఆధారపడ్డాం..

పూసపాటిరేగ ప్రాంతంలో ఎక్కువ మంది రైతులు మొక్కజొన్న సాగుపైనే ఆధారపడి జీవిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయాన్ని రైతులు ఆర్జిస్తున్నారు. ఎకరా సాగుకు రూ. పది వేల నుంచి 15 వేల రూపాయలు ఖర్చవుతుండగా.. సుమారు లక్ష రూపాయల వరకు దిగుబడి వస్తుంది. మొక్కజొన్న పంటను అత్యధికంగా పరిశ్రమ యాజమాన్యాలు కొనుగోలు చేస్తున్నాయి.

– కర్రోతు బాస్కరరావు, వెంపడాం రైతు.

లాభసాటి సాగు..

మొక్కజొన్న సాగులో దిగుబడి పెరిగితే అధిక లాభాలు వస్తాయి. రైతుల వద్దకే వ్యాపారులు వెళ్లి దిగుబడి కొనుగోలు చేస్తున్నారు. మొక్కజొన్న వినియోగం పెరడంతో పరిశ్రమ యాజమాన్యాలు రైతులకు గిట్టుబాటు ధర ఇచ్చి కొనుగోలు చేస్తున్నాయి. విత్తనాలు రాయితీపై సరఫరా చేసినట్లయితే మరింత మంది రైతులు మొక్కజొన్న సాగుపైనే ఆసక్తి చూపించే అవకాశం ఉంది.

– ఎం.రామునాయుడు, రైతు పతివాడ

నాటకరంగాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత



కళాకారుడు రాంబర్కి రామానాయుడును సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

విజయనగరం: విజ్ఞానంతో పాటు విలువలు, వినోదాన్ని పంచే నాటక రంగాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సాయికృష్ణ వాకర్స్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ ఏఎస్ ప్రకాశరావు అన్నారు. తెలుగు నాటకరంగ దినోత్సవం సందర్భంగా బుధవారం ఉదయం సాయికృష్ణ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక అయ్యన్నపేట జంక్షన్ వద్దనున్న నడక మైదానంలో ప్రముఖ కళాకారుడు రాంబర్కి రామానాయుడును సత్కరించారు. ఈ సందర్భంగా ఏఎస్ ప్రకాశరావు మాట్లాడుతూ.. ఒకప్పుడు దేదీప్యమానంగా వెలుగొందిన నాటకరంగం ఈ హైటెక్ యుగంలో టెక్నాలజీ, సెల్‌ఫోన్ ప్రభావంతో మసకబారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. క్లబ్ అధ్యక్షుడు తాడ్డి ఆదినారాయణ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు నాటక రంగం అవసరమని గుర్తించి, ఆ దిశగా ఎంతో కృషి చేస్తున్న రామానాయుడు అభినందనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ పెద్దలు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నగర పంచాయతీ కమిషనర్‌గా తారక్‌నాథ్

నెల్లిమర్ల: నగర పంచాయతీ కమిషనర్‌గా ఎ.తారక్‌నాథ్‌ని నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. తారక్ అమలాపురం పురపాలక సంఘం రెవెన్యూ ఆఫీసర్‌గా పని చేస్తూ ఉద్యోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఇంతవరకు ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ కె.అప్పలరాజు ఇటీవల విజయనగరం కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

డెంకాడ: విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల నేపథ్యంలో మండలంలోని రాజాపులోవ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు గురువారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విజయనగరం ఏపీఈపీడీసీఎల్ ఈఈ జి.సురేష్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోపాడ, జగన్నాథపురం, వల్లూరు, మోదవలసలో కొంత భాగానికి సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎస్‌డబ్ల్యూపీసీల పరిశీలన

గజపతినగరం రూరల్: మండల కేంద్రంతో పాటు మరుపల్లి గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రా ల(ఎస్‌డబ్ల్యూపీసీ)ను డీఎల్‌పీఓ మోహన్‌రావు బుధవారం పరిశీలించారు. కేంద్రాల్లో చెత్త కుండీలు, వర్మీ కంపోస్టు కుండీలను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో ఇళ్ల నుంచి సేకరించిన చెత్తలో తడి, పొడి చెత్తను వేరుచేయాలని, వర్మీ కంపోస్టు తయారు చేయాలని సూచించారు. ఆయన వెంట ఈఓపీఆర్డీ సుగుణాకరరావు, కార్యదర్శి గొల్ల పల్లి జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

చీపురుపల్లి: ఇటీవల శబరిమల వనయాత్ర చేసిన పట్టణానికి చెందిన అయ్యప్ప స్వాముల బృందం పట్టణంలో నిర్మిస్తున్న హరిహరపుత్ర అయ్యప్పస్వామి ఆలయానికి రూ.18 వేలు విరాళం అందజేసింది. నగదును ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులకు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ, ఎంపీపీ తనయుడు ఇప్పిలి విహార్ చేతుల మీదుగా బుధవారం అందజేశారు.

నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు..



36వ డివిజన్‌లో పర్యటిస్తున్న కమిషనర్ నల్లనయ్య

• కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య

విజయనగరం: పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిని సస్పెండ్ చేసేందుకు కూడా వెనుకాడబోమని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా 36వ డివిజన్ 43వ సచివాలయం పరిధిలో బుధవారం ఆయన పర్యటించారు. పారిశుధ్యం, వీధిదీపాల నిర్వహణ, తాగునీటి పంపిణీ వంటి అంశాలను ఈ సందర్భంగా పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్య వైఖరిపై మండిపడ్డారు. శతశాతం పనులు చేపట్టకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించడం, అధికారుల ఆదేశాలను బేఖాతరు చేసిన పబ్లిక్ హెల్త్ వర్కర్‌ను విధుల నుంచి తాత్కాలికంగా సస్పెండ్ చేశారు.

కొత్త పింఛన్లు ఇచ్చేదెప్పుడో...?



దత్తిరాజేరు మండల పరిషత్ కార్యాలయం

• కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కరికీ కూడా కొత్తగా మంజూరు కాని పింఛన్
• దరఖాస్తు చేసుకునేందుకు తెరచుకోని వెబ్ సైట్
• ఎదురు చూస్తున్న వేలాదిమంది అర్హులు

దత్తిరాజేరు: రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చి పది నెలలు గడిచిపోయినప్పటికీ ఒక్కరంటే ఒక్కరికి కూడా కొత్తగా సామాజిక పింఛన్ మంజూరు చేయలేదు.కొత్తపింఛన్లు మంజూరు చేయకపోగా ఉన్న వాటిలో కోత విధించే పనిలో ప్రభు త్వం బిజీగా ఉంది. అర్హులు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుందామంటే సంబంధిత వెబ్‌సైట్ తెరచుకోవడం లేదు. పింఛన్‌కు అర్హు లైన వృద్ధులు, దివ్యాంగులు, వితం తువులు ఎప్పుడు వెబ్‌సైట్ తెరచుకుంటుందా, దరఖాస్తు చేసుకుందామా అని నెలల తరబడి ఎదురు చూస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులు దరఖాస్తు చేసుకుంటే రోజుల వ్యవధిలో పింఛన్లు మంజూరయ్యేవి. వితంతు పింఛన్ అయితే మరింత వేగంగా మంజూరయ్యేది. భర్త చనిపోయిన వెంటనే డెత్ సర్టిఫికెట్ సచివాలయంలో సమర్పించడమే తరువాయి వితంతు పింఛన్ మంజూరు చేసే వారు. ఇదంతా 2024 ఎన్నికల కోడ్ రాకముందర వరకు పరిస్థితి. కానీ ప్రస్తుతం రాష్ట్రంలో ఆపరిస్థితి లేదు. భర్త చనిపోయి ఏడాది అవుతున్నా ఇంకా వితంతు పింఛన్ మంజూరు కాక గజపతినగ రం నియోజకవర్గంలో పదుల సంఖ్యలో ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వృద్ధులు కూడా అల్లాడుతున్నారు. పింఛన్ వస్తే కనీసం మందులు ఖర్చులకైనా ఎవరిపై ఆధారపడాల్సిన పనిలేదని ఆశిస్తుం టే.... ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రావడం లేదని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆ హామీని సైతం ఇంకా అమలు చేయలేదు.

వెబ్ సైట్ ఓపెన్ కాలేదు

కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు సంబంధిత వెబ్ సైట్ ఓపెన్ కాలేదు. దరఖాస్తు సచివాలయంలో ఇస్తే పేర్లు నమోదు చేస్తారు. పాత పింఛన్ల పరిశీలన పూర్తయిన తర్వాత కొత్త పింఛన్లకు అవకాశం ఉంటుంది.

– వై.వి.రాజేంద్రప్రసాద్, ఎంపీడీఓ, దత్తిరాజేరు

కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

గజపతినగరం నియోజకవర్గంలోని దత్తిరాజేరు, గజపతినగరం,బొండపల్లి, గంట్యాడ మండలాల్లో సుమారు మూడు వేల మందికి పైగా అర్హులు పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. దరఖాస్తు చేసుకునేం దుకు వీరంతా గ్రామసచివాలయాలు, మండల పరిషత్ కార్యాలయాల చుట్టూ తరచూ ప్రదక్షిణలు చేస్తున్నారు. దరఖాస్తులు స్వీకరించేందుకు సంబంధిత వెబ్‌సైట్ తెరచుకోవడం లేదనే సమాదానం మండ ల పరిషత్ కార్యాలయాల, సచివాలయాల సిబ్బంది నుంచి వినిపిస్తోంది. గతంలో ఏడాదంతా పింఛన్లకు సంబం ధించిన వెబ్ సైట్ ఓపెన్‌లో ఉండేది. అర్హులకు సచివాలయంలో రోజూ దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండేది. కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు వెబ్‌సైట్ ఓపెన్ కాలేదు. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు లేకపోవడంతో తామేమీ చేయలేమని ఎంపీడీఓ కార్యాలయాలు, సచివాలయాలకు దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు అధికారులు చెప్పి పంపిస్తున్నారు.

• ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి



సచివాలయాలకు వచ్చే ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించే దిశగా కార్యదర్శులు కృషి చేయాలని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య సూచించారు. నగరంలోని 6, 8 సచివాలయాలను బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. సిబ్బంది సమయపాలనపై ఆరా తీశారు. ప్రజలకు మెరుగైన పౌరసేవలు అందించాలని ఆదేశించారు.

– విజయనగరం

రహదారి భద్రతా నియమాలు పాటిద్దాం..



గొడిపాలెం అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్సై సన్యాసినాయుడు

• ఎస్సై సన్యాసినాయుడు

డెంకాడ: ప్రజలందరం రహదారి భద్రతా నియమాలు పాటించాలని ఎస్సై ఎ.సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని గొడిపాలెం, బంటుపల్లి, పెదతాడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మెర్సీమిషన్ పాఠశాలల్లో నేరాల నియంత్రణ, తదితర అంశాలపై బుధవారం అవగాహన సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యక్రమాలను నిరోధించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. మితిమీరిన వేగంతో డ్రైవింగ్ చేస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు ఇవ్వకూడదని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు తప్పవన్నారు.

కృష్ణమూర్తికి జాతీయ స్వర్ణనంది అవార్డు



జాతీయ స్వర్ణనంది పురస్కారం అందుకుంటున్న గ్రంధి కృష్ణమూర్తి

విజయనగరం టౌన్: సేవా రంగంలో విశేష సేవలందించినందుకు గాను జిల్లాకు చెందిన బీజేపీ కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి, వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ డిప్యూటీ గవర్నర్‌గా ఉన్న గ్రంధి కృష్ణమూర్తికి హైదారాబాద్ శిఖరం ఆర్ట్స్ థియేటర్స్ జాతీయ స్వర్ణనంది అవార్డును మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో ప్రదానం చేసింది. ఈ మేరకు జిల్లాకు చేరుకున్న ఆయన బుధవారం వివరాలు వెల్లడించారు. సామాజిక సేవారంగంలో కొన్నేళ్లుగా విశేషమైన సేవలందించినందుకు గాను తనకు ఉగాది నామ సంవత్సర జాతీయ స్వర్ణనంది ని ప్రదానం చేశారన్నారు. నెల్లూరుకి చెందిన కామంచి శారదకు కూడా అవార్డు అందజేశారని తెలిపారు. ఈ మేరకు ఆయన్ను వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అభినందనలు తెలియజేశారు.

సత్య డిగ్రీ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు

విజయనగరం అర్బన్: రాజస్థాన్‌లో ఈ నెల 18 నుంచి 28వ తేదీ వరకు జరగనున్న స్కిప్పింగ్ గేమ్ సౌత్‌జోన్ పోటీల్లో ఆంధ్ర యూనివర్సిటీ జట్టు తరపున పట్టణానికి చెందిన సత్య డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు తలపడనున్నారు. ఆంధ్రా యూనివర్సిటీ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ 2024 – 25 ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన అంతర్ కళాశాలల పోటీలలో ప్రతిభ చూపిన ఎం.శ్రీవల్లి, పి.రమ్య, ఎల్.వరలక్ష్మి, ఎం.సేతుమాధవి సౌత్ జోన్ పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఎంవీ సాయిదేవమణి తెలిపారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, తదితరులు బుధవారం ప్రత్యేకంగా అభినందించారు.

తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు



చంపావతిలో నీటి సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

• డీఈఈలు శ్రీనివాసరావు, ప్రసాదరావు

విజయనగరం: నగర ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని విజయనగరం కార్పొరేషన్ డీఈఈలు శ్రీనివాసరావు, ప్రసాదరావులు అన్నారు. నగర ప్రజలకు తాగునీటిని అందించే నెల్లిమర్ల చంపావతి నది వద్దనున్న హెడ్ వాటర్ వర్క్స్ వద్ద నీటిమట్టాలను బుధవారం తనిఖీ చేశారు. ఆంధ్ర నుంచి వచ్చిన నీరు ఎంత మేరకు నగర ప్రజలకు సరిపోతుందో అంచనా వేశారు. ఇంకా ఎన్ని టీఎంసీల నీరు అవసరమవుతుందో అన్న వివరాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేసవికాలంలో ప్రజలకు అవసరమైన నీటి పంపిణీకి తగు చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటికే ఆంధ్ర నుంచి నీటిని విడుదల చేయించామని చెప్పారు. ప్రస్తుతం నెల రోజుల వరకు ప్రజలకు సరిపడా నీటి లభ్యత సిద్ధంగా ఉందన్నారు. అప్పటికీ వర్షాలు కురవని పరిస్థితుల్లో మరోసారి ఆంధ్ర నుంచి నీటిని విడుదల చేయించే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో ఏఈ రవి, తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీదేవి విగ్రహావిష్కరణ

కొత్తవలస: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సరస్వతీదేవి విగ్రహాన్ని స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి బుధవారం ఆవిష్కరించారు. కళాశాలకు అదనపు తరగతి గదులు మంజూరు చేయాలని, ప్రహరీ నిర్మాణాన్ని పూర్తి చేయాలని, క్రీడామైదానాన్ని అభివృద్ధి చేయాలని ప్రిన్సిపాల్ భీమ శంకర్ కోరారు.